క్లుప్తంగా

పట్టుదలతో చదివితే విజయం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయం లభిస్తుందని విద్యావేత్త మల్లికార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రేరణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరిలో సామర్థ్యం, నైపుణ్యాలు ఉంటాయని, వాటిని సరైన సమయంలో, సరైన విధంగా వినియోగించుకునే వారు తప్పకుండా అనుకున్న లక్ష్యాన్ని చేరుతారన్నారు. కష్టపడి చదివే విద్యార్థులు నిద్ర, విశ్రాంతి అనేది లేకుండా నిరంతరం శ్రమించే వారీగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళావెంకట్, పూజితామోహన్‌రెడ్డి, శిరీషప్రదీప్‌కుమార్, కృష్ణసుకాంత్, ప్రిన్సిపాల్ మల్లికార్జున్, రామకృష్ణ, పార్వతీశం పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



జడ్చర్ల టౌన్: మహర్షి దయానంద సరస్వతీ 200 జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని ఆదివారం స్థానిక దయానంద విద్యామందిరంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన హైదరాబాద్ ఆర్యప్రతినిధి సభ వేద అలంకార్ హరికిషన్, యజ్ఞ బ్రహ్మ వేదసింధులు పాల్గొని దయానంద సరస్వతి గూర్చి వివరించారు. వేడుకల్లో ఆర్య సమాజ ప్రతినిధులు స్రవంతి, నందిని, గుబ్బ అశోక్, నర్సింహులు, విజయ్‌కుమార్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



గండేడ్: ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకు పాటుపడాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బోయినిగోపాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌లు రాజకీయంగా ఎందగాలని, అప్పుడే ఆర్థికంగా బలోపేతం అవుతామన్నారు. ముదిరాజ్‌లు తమ ఓట్లను తాము వేసుకుని రాజ్యాధికారం సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి కేశవులు, నర్సప్ప, రాములు, గిరమోనిలక్ష్మీనారాయణ, అంజిలయ్య, డాక్టర్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కు గరుడ సేవా అవార్డు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వివిధ సామాజిక రంగంలో విశిష్ట సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను జిల్లా కేంద్రం సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీ లక్ష్మి నారాయణ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు మణి ఆనంద్‌కుమార్‌కు గరుడ సేవా అవార్డు లభించింది. ఆదివారం సంగారెడ్డిలోని బీరంగౌడ్ శివాలయం గుట్ట గుడిలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ వాగ్దేవి విద్య వాయిద్య సంగీత కళానృత్య సాంస్కృతిక సంస్థ చైర్మన్ నాగేందర్ యాదవ్ చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. ఈ అవార్డును అందుకోవడం తనకు మరింత బాధ్యత పెంచిందన్నారు. శశిధర్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినం

గండేడ్: చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు. కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులు 45 మందికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రభునాయక్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి కేసారం విజయకుమార్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, కావలి నరసయ్య, నరేష్ పాల్గొన్నారు.



ప్రైవేట్‌కు దీటుగా వసతులు



డ్యూయల్ డెస్క్ బెంచీలపై విద్యార్థులు

- కోడూర్ పాఠశాలకు కొత్త శోభ
- 'మన ఊరు – మన బడి'తో మారిన రూపురేఖలు
- రూ.16.23 లక్షలతో పనులు
- ఆనందంలో విద్యార్థులు

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని కోడూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సరికొత్తగా మారింది. సకల వసతులు, ఆధునిక సౌకర్యాలతో కార్పొరేట్ పాఠశాలను తలపిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు – మన బడి' కింద తొలి విడత మండలంలో 10 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో కోడూర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.16.23 లక్షలు మంజూరయ్యాయి. రూ.7.83 లక్షలతో ఎలక్ట్రిషన్, తాగునీరు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, డెస్కులతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించారు. ఇక రూ.8.40 లక్షల ఈజీఎస్ నిధులతో టాయిలెట్స్ నిర్మించారు.



మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

సకల సౌకర్యాలు..

'మన ఊరు– మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో సకల సౌకర్యాలు సమకూరాయి. సౌకర్యాల కల్పనలో సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్ ఎక్కడా కూడా వెనక్కి తగ్గకుండా సకాలంలో పనులు చేయించారు. పనుల నిర్వహణలో ఆయన చూపిన చొరవ తెగువతో పనులు చేపట్టారు. దీంతో పాఠశాలలో చేకూరిన సౌకర్యాలను చూసి గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు ఎంతో సంతోష పడుతున్నారు. ఇతరులు పాఠశాల పనులు చేస్తే సక్రమంగా చేయరని భావించిన సర్పంచ్ తానే స్వయంగా పనులు చేపట్టి ఆ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేశారు. పాఠశాలలో చేపట్టిన పనులతో తాగు నీరు, టాయిలెట్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, అభ్యసించేందుకు డెస్కులు వంటి సౌకర్యాలు సమకూర్చారు. 'మన ఊరు – మన బడి' కార్యక్రమం కింద రూ.7.83 లక్షలు, ఎస్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.8.40 లక్షలు మంజూరయ్యాయి. జిల్లాలోనే మొట్టమొదటగా 'మన ఊరు – మన బడి' పనులు పూర్తయినా నేటి వరకు నిధులు డ్రా కాకపోవడం శోచనీయం. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తనకు మిగతా బిల్లులు మంజూరు చేయాలని సర్పంచ్ కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు జీవం

'మన ఊరు – మన బడి' పథకం ప్రభుత్వ పాఠశాలలకు జీవం పోసింది. సౌకర్యాల లేమితో కనిపించిన పాఠశాల నేడు సర్వాంగ సుందరంగా మారిపోయింది. మా పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించి కొత్త రూపు తెచ్చాం. పిల్లలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాం. ఒకప్పటికీ ఇప్పటికీ ఎంతో మార్పు వచ్చింది. ఇప్పుడు మా పాఠశాలను చూస్తే మాకే ఉత్సాహం వస్తుంది. మా పాఠశాల పిల్లల్లోనూ సంతోషం నెలకొంది.

– వంగ రమేష్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు



మధ్యాహ్న భోజనం చేసేందుకు నూతనంగా నిర్మించిన కొళాయిల వద్ద ప్లేట్లు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

బీజేపీ అధికారంలోకి వస్తేనే భరోసా..



హేమాజిపూర్‌లో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్



నవాబుపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు

బాలానగర్: కేంద్రంతో పాటు రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధితో పాటు ప్రజలకు భరోసా చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ అన్నారు. ప్రజా గోస– బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఆదివారం బాలానగర్ మండల పరిధిలోని 85, 86, 87 బూతుల్లో ప్రజలతో, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. రానుంది బీజేపీ ప్రభుత్వమే అని, అందుకు ప్రతి కార్యకర్త కొద్దిగా ఇష్టపడి శ్రమించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాబోతుల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పులమోని నర్సింలు, అవినాష్, శ్రీశైలం, భాను ప్రతాప్, వేణు, మాధవ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

చిన్నచింతకుంట: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి పాలన కొనసాగిస్తుందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ ఆరోపించారు. ఆదివారం చిన్నచింతకుంట మండలం పర్దిపూరంలో బీజేపీ శక్తి కేంద్రం కార్నర్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. ప్రాజెక్టుల పేరుతో రూ.కోట్లు కొల్లగొడుతూ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు, దశరత్, కుర్వరమేష్, నరేందర్‌జీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలతోనే కేసీఆర్ డ్రామాలు'

నవాబుపేట: కేంద్రంలోని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను కేసీఆర్ తాము చేసినట్లు గొప్పలు చెప్పుకొని ప్రజలను మభ్యపెడుతున్నారని బీజేపీ జడ్చర్ల నియోజకవర్గ నాయకురాలు బాలత్రిపురసుందరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రజల గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కేంద్రం గ్రామాల్లో వేసిన రోడ్లతో పాటు ప్రజలకు అందుతున్న బియ్యం వరకు అన్ని కేంద్రం అందించిందని ఆమె వివరించారు. కేసీఆర్ కేవలం ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రం ఏర్పాటు నుంచి నేటి వరకు దళితులను కేసీఆర్ మోసం చేస్తూ.. వస్తున్నారని ఆరోపించారు. గతంలో సీఎం హామీ తాజాగా దళితబంధు హామీలు అన్ని ఓట్ల కోసమేనని విమర్శించారు. పేదల గోడు పట్టని కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆమె ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలో రోడ్లు వేసి రోడ్డులో ఇళ్ల కోల్పోయిన బాధితులకు పరిహారం నేటికి అందించలేదన్నారు. వెంటనే వారికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా నాయకులు శ్రీకాంత్, యాదయ్య, నర్సింహ, శ్రీనివాస్, రాజు, సత్యం, నర్సింహులు, లక్ష్మీనారాయణ, రమేష్, కమలాకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈదమ్మ ఉత్సవాలు



అమిస్తాపూర్‌లో ఈదమ్మ దేవాలయం వద్ద బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో ఆదివారం ఈదమ్మ జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు, చిన్నారులు బోనాలతో ఈదమ్మ దేవాలయం వద్దకు వెళ్లి బోనం సమర్పించారు. ఈదమ్మ జాతర సందర్భంగా బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్‌రెడ్డి ఈదమ్మను దర్శించుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈదమ్మను దర్శించుకున్నారు.

మైసమ్మ చెంత భక్త జనం

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ దేవాలయంలో ఆదివారం భక్త జనం తండోపతండాలుగా వచ్చి పూజలు చేశారు. దీంతో మైసమ్మ దేవాలయం మొత్తం భక్తులతో కిటకిటలాడింది. అడవిలో దేవాలయం ఉండటం.. పైగా ఆదివారం కావటంతో చాలా మంది భక్తులు దేవాలయంలో మొక్కులు చెల్లించుకుని సేద తీరారు.



మైసమ్మ దేవాలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కరాటేతో దేహదారుఢ్యం పెంపు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడంతో దేహదారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్పీ వెంకటేష్ అన్నారు. జీకే కరాటే షోటోకాన్ సీనియర్ మాస్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో ఆదివారం విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ వెంకటేష్ మాట్లాడారు. విద్యార్థులు కరాటే శిక్షణ తీసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. జీకే షోటోకాన్ కరాటే ఫౌండర్, చీఫ్ జి.కృష్ణయ్య, మాస్టర్ రవికుమార్ ఎగ్జామినర్‌లుగా వ్యవహరించి విద్యార్థుల బెల్ట్ గ్రేడింగ్ పరీక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడారు. ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందని అన్నారు. ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని కోరారు. జీకే మాస్టర్ షోటోకాన్ ఆధ్వర్యంలో కొన్నేళ్ల నుంచి విద్యార్థులకు కరాటే శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని, వీరిలో యెల్లో బెల్ట్ 12, ఆరంజ్ 10, బ్రౌన్ 4, మెరూన్ 3, బ్లాక్ బెల్ట్ ఇద్దరు విద్యార్థులు సాధించినట్లు కరాటే మాస్టర్ శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామాంజనేయులు, పీపీ రఘుపతి, సీనియర్ కరాటే మాస్టర్ శివకుమార్, బ్లాక్ బెల్ట్ మాస్టర్లు అఖిలేశ్వర్‌రెడ్డి, నవీన్, పవన్, శశికళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కౌన్సిలర్ రామాంజనేయులు, కరాటే మాస్టర్లు

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన వివాహిత కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు చేసినట్లు అడ్డాకుల ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆచారి, హైమావతి కుమార్తె శాంతమ్మను కొన్నాళ్ల కిందట పెద్దమండడి మండలం వెల్టూర్‌కు చెందిన యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. అయితే కుటుంబం విషయంలో భర్తతో గొడవపడిన శాంతమ్మ ఆరు నెలలుగా కందూర్‌లోనే తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. తన కోసం ఎవరూ వెతకవద్దని ఓ లెటర్ రాసి ఇంట్లో పెట్టి వెళ్లింది. ఉదయం నుంచి తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తన కుమార్తె కనిపించడం లేదని తల్లి హైమావతి అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ముమ్మరంగా ఆలయాల పునర్నిర్మాణ పనులు

దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయాల పునర్నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎండోమెంట్ శాఖ పరిధిలోని ఈ దేవాలయాలకు దాతలు ముందుకు వచ్చి విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. పురాతనమైన శివాలయం, గాలి గోపురం పనులు, వంద సంవత్సరాల నాటి వీరప్పయ్యస్వామి దేవాలయం గాలి గోపురం నిర్మాణ పనులు, ధర్మ సత్రం పనులు రెండు నెలలుగా కొనసాగుతున్నాయి. అలాగే ప్రసిద్ధి చెందిన చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవస్థానం విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలతో పాటు గర్భగుడి నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



దేవరకద్రలో కొనసాగుతున్న శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాల పనులు

బాలిక అదృశ్యం: కేసు నమోదు

బాలానగర్: మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక శనివారం అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయిందని, ఇరుగు పొరుగు వారి ఇళ్లలో, బంధువుల ఇళ్లలో, స్నేహితుల వద్ద కూడా వెతికినా ఆచూకి లభించలేదని, బాలిక తండ్రి ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జయ ప్రసాద్ తెలియజేశారు.

ఆర్థిక సాయం అందజేత



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 చదివిన పూర్వ విద్యార్థుల్లో ఒకరు అనారోగ్యంతో మృతిచెందడంతో బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం పూర్వ విద్యార్థులు రూ.55 వేల ఆర్థికసాయం చేశారు. బాల్య స్నేహితుడు మజారుద్దీన్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ.. ఈ నెల 4న మృతి చెందాడు. స్నేహితుడి కుటుంబానికి తమ వంతు ఆర్థిక సాయం చేసి పలువురి మన్ననలు పొందారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖాజా, శివ, రవీందర్, కుర్మయ్య, సుధాకర్, అశోక్, బాలరాజ్, రఘు, రేఖ్య పాల్గొన్నారు.

వార్డు గదిని బాగు చేయించండి



అడ్డాకుల పీహెచ్‌సీలో ఊడిపోయిన పైకప్పు సీలింగ్

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వార్డు గది నిరుపయోగంగా మారింది. రోగులకు చికిత్స అందించే వార్డు గదిలో ఏడాదిన్నర కిందట పైకప్పు సీలింగ్ ఊడిపోయింది. పైకప్పు నుంచి వర్షాకాలంలో నీళ్లు కిందకు లీకవడంతో సీలింగ్ ఊడి కిందపడింది. దీంతో అప్పటి నుంచి ఆ గదిని వైద్య సిబ్బంది పూర్తిగా మూసి వేసి ప్రస్తుతం దాన్ని స్టోర్ రూంగా వాడుతున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను ఇతర గదుల్లో ఉంచి చికిత్స చేస్తున్నారు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆరు బెడ్ల ఆస్పత్రిలోని ఒక్క గది సీలింగ్ ఊడిపోయి పైకప్పు నుంచి ఇనుప రాడ్లు, ఇతర వస్తువులు కింద పడుతుండటంతో ఆ గదిని ఎప్పుడు మూసి ఉంచుతున్నారు. సుమారు ఏడాదిన్నర అవుతున్నా దాని గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. కొన్నాళ్ల కిందట జిల్లా నుంచి వచ్చిన బృందం దీన్ని పరిశీలించి వెళ్లింది. అయినా నేటికి పనులు ప్రారంభించలేదు. ఇదిలా ఉండగా.. ఈ నెల 23న కలెక్టర్ రవినాయక్ అడ్డాకులకు వచ్చినప్పుడు ఆస్పత్రిని పరిశీలించారు. వార్డు గది గురించి వైద్యురాలు అపర్ణతో వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డు గదిని బాగు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



బాలానగర్: అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా బాలానగర్ మండల మాజీ సర్పంచ్ సాటి శ్రీనివాస్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట నర్సయ్య యాదవ్ సమక్షంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన యాదవుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా సాటి శ్రీనివాస్ యాదవ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మి నర్సింహ యాదవ్, మేకల శ్రీశైలం, కుర్వ శ్రీనివాస్‌తో పాటు ఆయా గ్రామాల యాదవులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్రం



మూసాపేటలో పెచ్చులూడిన పశువైద్య కేంద్రం పైకప్పు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం ఎప్పుడు కూలుతుందో తెలియడం లేదు. నిత్యం భవనం పైకప్పు నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో ఆస్పత్రిలో పశువైద్య సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో అటెండర్ సావిత్రి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కూడా ఆస్పత్రి ఆవరణలోనే ఉంటూ చికిత్సలు చేస్తున్నారు. క్యాంపులు, ఇతర కార్యక్రమాలను పశువైద్యాధికారులు సైతం ఆస్పత్రి ఆవరణలోనే చేసి బయట నుంచి బయటనే వెళ్లిపోతున్నారు. భవనం లోపల ఉండటానికి వైద్య సిబ్బంది సాహసం చేయాల్సిన పరిస్థితే నెలకొంది. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరినా పట్టించుకునే వారు కరువయ్యారు. గత వర్షాకాలంలో భవనాన్ని ఖాళీ చేసి యువజన సంఘం భవనంలో ఏర్పాటు చేయాలని భావించినా కుదరలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెచ్చులూడుతున్న భవనాన్ని వెంటనే కూల్చివేయించి నూతన భవన నిర్మాణం చేయించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట నుంచి అచ్చాయపల్లి వరకు జాతీయ రహదారి సమీపంలో సర్వీస్ రోడ్డు లేదు. దీంతో గ్రామస్తులు ప్రధాన రహదారిపై రాంగ్‌రూట్లో ప్రయాణిస్తున్నారు. జానంపేట నుంచి అచ్చాయపల్లికి వెళ్లాలంటే మూసాపేట చౌరస్తా వరకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో అదనంగా కిలోమీటర్ దూరం తిరిగి రావాల్సి ఉండటంతో వాహనదారులు జానంపేట పాత పెట్రోల్ పంపు నుంచి రాంగ్‌రూట్లో అచ్చాయపల్లి స్టేజీ వరకు వెళ్తున్నారు. కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు కూడా రాత్రివేళ రాంగ్‌రూట్లో వెళ్తున్నారు. ఇదిలా ఉండగా అచ్చాయపల్లి స్టేజీ నుంచి జానంపేట వరకు రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో గ్రామస్తులు రాకపోకలు సాగించడంతో చిన్న దారి ఏర్పడింది. అదే దారిని సర్వీస్ రోడ్డుగా ఏర్పాటు చేస్తే ప్రధాన రోడ్డుపై రాంగ్ రూట్లో వెళ్లాల్సిన అవసరం ఉండదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అచ్చాయపల్లి స్టేజీ నుంచి జానంపేట వరకు సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



అచ్చాయపల్లి స్టేజీ వరకు రహదారి పక్కన గ్రామస్తులు వెళ్లే రోడ్డు

నాయకులపై ఫిర్యాదు

జడ్చర్ల: మండల పరిధిలోని లింగంపేటలో ఆదివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్నర్ మీటింగ్‌లో తోపులాట చోటు చేసుకుంది. బీజేపీ నాయకుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తాము కార్నర్ మీటింగ్‌లో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన కొందరు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమావేశంలోకి చొచ్చుకుని వచ్చి ఘర్షణకు పాల్పడ్డారని తెలిపారు. రాష్ట్ర నాయకులు శాంతికుమార్ ప్రసంగించి వెళ్లిన అనంతరం నాయకులు మధుసూదన్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతున్న సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు వేదికపైకి వచ్చి తమను తోసేశారని పట్టణ శాఖ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలియజేశారు.

జడ్చర్లలో వైద్యశిబిరం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఏగూర్‌ప్రైమ్ ఆస్పత్రిలో ఆదివారం జనరల్ మెడిసన్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డా.ఆదిత్య అవసరమైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ, మధుమేహం, థైరాయిడ్‌కు సంబంధించిన పరీక్షలు చేశారు. శిబిరంలో మొత్తం 82 మంది హాజరయ్యారు.